పల్లవి : దాశరథీ కరుణా పయోనిధీ !

ధర్మరక్షకై భువికేతెంచిన మహనీయపథీ ! ॥ దాశరథీ ॥

చరణం :

1. అమరాదుల కోరిక మన్నించగ విబుధారుల వేగము శిక్షించగ
దశరథు ముంగిట పంట పండగ జగమంతయు సంతసిల్లగా
మముబ్రోవగ అవతారము నెత్తిన మా పాలిట పెన్నిధీ !

॥ దాశరథీ ॥

2. పున్నమి చంద్రుని గుండ్రటి మోమున మొల్కు నవ్వులే మొలవంగ
చిన్ని రాముని మోహనరూపము విశ్వమంతయు వెలగంగ
కౌసల్యానందకందవై భువి మోదము నొందగ సౌందర్యనిధీ !

॥ దాశరథీ ॥

3. కౌశిక యాగము రక్షించి ఘోరతాటకను శిక్షించి
గౌతమ పూజను గొని వేగము మిథిలకు చని నచ్చరువున
హరవరచాపము పెళ్ళున విరిచి సీతను పొందిన కళ్యాణపథీ !

॥ దాశరథీ ॥

4. పురజన కీర్తిత గుణ సాగరమై సీతా కామిత సుందర తనువై
రాకా చంద్ర సమాన దీధితుల ఒకరికి నొకరై మనసున మనసై
ముచ్చట గొలపగ మరి మరి పొగడగ వలపును సలపిన ఆదర్శపతీ !

॥ దాశరథీ ॥

5. అడవికి బొమ్మని యానతిచ్చిన తడబడక నీవు తండ్రి మాటన
కాంతానుజులతో నారచీరలతో ఘనవనవాసము సలిపి
రక్కసుల చంపి సన్మునుల కాచిన పితృవాక్యపాలన పథీ !

॥ దాశరథీ ॥

6. కపట రావణుడు ఏకాంతమ్మున కాంతను హరింప శోధించి
కాంతారమంత కానక సీతాయని కరుణన శోకించి
తనకై తనువును బాసిన ఖగముకు సద్గతినిచ్చిన సౌజన్యనిధీ !

॥ దాశరథీ ॥

7. రణధరణిన ఘనభీకరశరముల ఖరకులముల బహు దహియించి
భయభీతుని హరిసూనుని బరిచరుగా గొని హరి అసువుల హరియించి
హనుమంతుని ధీమంతుని సీతాన్వేషణ పంపిన నృపనీతినిధీ

॥ దాశరథీ ॥

8. రావణు నిఖిలజగద్విద్రావణు రణమున దారుణముగ పరిమార్చి
పావనచరితను భూజాతను గొని నిజపురమునకు చని ఘనమున
ముల్లోకము కొనియాడగ రామరాజ్యము సల్పిన సాకేతపతీ !

॥ దాశరథీ ॥

9. ఒకటే మాటట ఒకటే సతియట ఒకటే బాణము ఒకటే మార్గము
ఒకడే కద రఘురాముడు ఒకటే గమ్యము శ్రేయము మాకును సత్యము
అని సుందర పాఠక బృందము డెందము నిండిన వాత్సల్యమతీ !

॥ దాశరథీ ॥

10. రాముని, సకలజనాభిరాముని, త్రిజగన్మోహుని,
సమస్త సజ్జన స్వాంతారాముని, దురితవిరాముని,
శ్రీ సీతారాముని, మా వేంకటరాముని
సంకటములు తొలగంగ సన్మంగళములు కలుగంగ
మనమున ముదమున మరి మరి తలచితిమీ !

॥ దాశరథీ ॥

అఅఅ

# ॥ సుందరకాండ పఠనం – శ్రీ హనుమ నామ భజన – 06.12.2020 ॥

01. జయహనుమా జయహనుమా । సీతారామ ప్రియ శ్రీ హనుమా ॥ ॥ జయ ॥
02. శ్రీరామదూత శ్రితపారిజాత । అంజనాసుత అద్భుతచరిత ॥ ॥ జయ ॥

03. త్రిమూర్త్యాత్మక త్రిలోకపూజిత । త్రిదశసన్నుత త్రిగుణాతీత ॥ ॥ జయ ॥
04. భీమ రూపధర భీమ సహాయక । భయ నివారణ భక్త పాలన ॥ ॥ జయ ॥

05. సమీర కుమార సమాన రహిత । సద్గుణశీల సదా జయంకర ॥ ॥ జయ ॥
06. లయకరాంశజ లక్ష్మణ రక్షక । లంకా శిక్షక లంకా దాహక ॥ ॥ జయ ॥

07. కదళీ వన ప్రియ కామ రూపధర । సహజ కుండల స్వర్ణోపవీత ॥ ॥ జయ ॥
08. అహిమహి రావణ జీవన హరణ । గ్రహబాధా నిర్మూలన చతుర ॥ ॥ జయ ॥

09. సకలాస్త్ర శస్త్ర శక్తి నివారణ । సకల కళామయ సాధుజీవన ॥ ॥ జయ ॥
10. శివ స్వరూప శీఘ్ర వరప్రద । శ్రీగుణ శోభిత సీతార్తి హరణ ॥ ॥ జయ ॥

11. అజాడ్యారోగ్య వాక్పటుత్వద । బుద్ధి బలధైర్య విజయ ప్రదాత ॥ ॥ జయ ॥
12. శ్రీరామప్రియ శ్రీవిజయధ్వజ । సమానరహిత సకల శుభంకర ॥ ॥ జయ ॥

- - -